క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకా రం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 11 మందిని అదుపులోని తీసుకున్నారు. వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా ఆరుగురికి రూ. 2 వేలు, నలుగురికి రూ.1500, మరో వ్యక్తికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఘనంగా ఉర్సే షరీఫ్ ఉత్సవాలు


దర్గాలో పూజలు చేస్తున్న ప్రజలు

న్యాల్‌కల్ (జహీరాబాద్): న్యాల్‌కల్ గ్రామ శివారులోని ఉర్సే షరీఫ్ ఫీర్ గైబ్ సాహెబ్ దర్గాలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆరోవ రోజు బుధవారం దర్గా వద్ద ప్రజలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రి నిర్వహించిన ఖవాలి అందరిని ఆకట్టుకుంది. ఉత్సవాలకు దర్గా పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్నాటక రాష్ట్రం నుంచి ప్రజలు దర్గాకు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నేడు రాజకీయ నాయకులతో సమావేశం

కంగ్టి(నారాయణఖేడ్): ఎంపీటీసీ ఎన్నికల దృష్ట్యా గురువారం కంగ్టి మండలంలోని అన్నీ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. పార్టీల నాయకులకు ఎన్నికల తీరు తెన్నులపై అవగాహన కల్పించడంతో పాటు శాంతియుతంగా ఎన్నికలు జరిపేందుకు సహకరించేట్లు ప్రేరణ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉ.11 గంటలకు ఎంపీడీఓ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి అన్నీ పార్టీల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్‌రావు


మొక్కలు నాటుతున్న అధికారులు


సంగారెడ్డి టౌన్: ఆడపిల్లలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీధర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని రాజంపేటలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఆడపిల్లల ప్రాముఖ్యతను తెలియజేసి వారిని రక్షించాలన్నారు. ఉన్నత చదువులు చదివించి, ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త పల్లవి, సీడీపీఓ చంద్రకళ, అటవీశాఖ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఎన్నికల జాబితా సిద్ధం


కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎన్నికల డ్రాఫ్ట్

కంగ్టి(నారాయణఖేడ్): మండల ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలకు ఎంపీటీసీ స్థానాలు, పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్యతో కూడిన జాబితాలు సిద్ధంగా ఉన్నట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. కంగ్టి మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలకు 36, 310 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. మొత్తం 70 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల్లో సంబంధిత నియోజకవర్గాల వివరాలు ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. కంగ్టి ఎంపీడీఓ కార్యాలయంలో డ్రాఫ్ట్ ప్రదర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ సుభాష్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మండలంలోని సంజీవన్‌రావుపేటకు చెందిన మహిపాల్‌కు సీఎం సహాయనిధి నుంచి రూ.28, 500 చెక్కు మంజూరయింది. సంబంధిత చెక్కును బుధవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గ్రామానికి వెళ్లి లబ్ధిదారు తల్లి సుశీలకు అందజేశారు. మాజీ ఎంపీటీసీ భూపాల్, నాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం


చీలమామిడి గ్రామంలో అంగన్‌వాడీ భవనం

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం, పట్టింపులేని తనంతో అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థలో కొనసాగుతోంది.. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా అవేమీ పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండల పరిధిలోని చీలమామిడి గ్రామంలో 8 సంవత్సరాలుగా ఇదే భవనంలో అంగన్‌వాడీ సెంటర్‌ను కొనసాగిస్తున్నారు. ఇటీవల నారాయణఖేడ్ అంగన్‌వాడీ భవనంలో పెచ్చులూడి పలువురు చిన్నారులకు గాయాలయ్యాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినా.. చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు చర్యలు తీసుకొని సురక్షిత భవనాలకు తరలించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పొగాకు రహిత యువతగా మార్చుదాం

పొగాకు నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి


అవగాహన కల్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: పొగాకు రహిత యువతగా మారుద్దామని పొగాకు నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పొగాకు నియంత్రణపై ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు యువత బానిసై విచ్చలవిడిగా వాడుతున్నారని, దానివల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సిగరెట్, జర్దా, గుట్కా, పాన్‌మసాలాలు సేవించి చిన్న వయస్సులోనే వివిధ రకాల జబ్బులు క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తులు వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా టెలిమానస్ 14416 ద్వారా కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రామచందర్, అఖిల్ హుస్సేన్, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

మిన్నంటిన ఆందోళనలు


గొర్రెలతో నిరసన ర్యాలీ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ నల్లవల్లి గ్రామ సమీపంలోని ప్యారానగర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు 8వ రోజుకు చేరాయి. బుధవారం డంపింగ్ యార్డు వద్దంటూ ఆందోళనకారులు వినూత్న ర్యాలీకి శ్రీకారం చుట్టారు. గొర్రె పిల్లలతో ర్యాలీ నిర్వహించి వినతిపత్రాలు అందజేశారు. నిరసనకారుల నినాదాలతో మండల కేంద్రం దద్దరిల్లిపోయింది. రిలే నిరాహార దీక్షకు దిగిన నిరసనకారులకు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి సంఘీభావం ప్రకటించి దీక్షలో కూర్చున్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటు సరైన చర్య కాదని ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రభుత్వ చర్యలను అడ్డుకునేందుకు పోరాటం చేస్తామన్నారు. కాగా, డంపింగ్ యార్డ్ ఏర్పాటుపై రాష్ట్ర హైకోర్టు స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. కార్యక్రమంలో జేఏసీ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు వేతనం అందజేత


వేతనాలు అందజేస్తున్న రవిసింగ్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామికవాడలోని ధనలక్ష్మి ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ రెడీమిక్స్ కంపెనీ డ్రైవర్లకు బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు అండగా నిలిచాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన ఉదయ్ ఆసీస్ రెడీమిక్స్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా ధనలక్ష్మి ట్రాన్స్‌పోర్ట్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్న ఎలాంటి కారణం లేకుండానే యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో వారు రాష్ట్ర కార్మిక నాయకులు రవి సింగ్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు రవిసింగ్ యాజమాన్యంతో మాట్లాడి ఇద్దరు డ్రైవర్లకు రావాల్సిన మూడు నెలల వేతనం రెండు లక్షల రూపాయలు అందజేశారు. రవి సింగ్ చొరవకు డ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు అనిల్ సుదర్శన్, జగన్, కిరణ్ పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కుటుంబ గొడవలతో సొంత తమ్ముడిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి భవాని చంద్ర బుధవారం తీర్పించారు. వివరాల ప్రకారం.. పట్టణంలోని బొంబాయికాలనీకు చెందిన మొహ్మద్ ఇబ్రహీం 2020 జనవరి 17న తన తమ్ముడు మొహ్మద్ లతీఫ్‌ను కుటుంబగొడవలతో గొడ్డలితో నరికి చంపాడు. ఇబ్రహీంను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడు. అనంతరం విచారణలో భాగంగా పోలీసులు పక్క ఆధారాల తో కోర్టులో చార్జిషీట్‌ను సమర్పించడంతో కేసును విచారించిన న్యాయమూర్తి భవానిచంద్ర నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ. 300 జరిమానా విధించారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన ఇన్‌స్పెకర్లు రమేష్, జగదీశ్వర్, కానిస్టేబుల్‌లు కాశీనాథ్, సుమన్, మహేందర్‌లను పోలీసు ఉన్నతాధికారులు ప్రశంసించారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం నల్తూరు గ్రామంలో మల్లికార్జున స్వామి జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. జాతరలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, పృథ్విరాజ్ , వెంకటేశం గౌడ్ పాల్గొని మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ... తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలకు జాతరలు ప్రతీకగా నిలుస్తున్నా యని అన్నారు. అలాగే, భ్రమరాంబ మల్లికార్జున స్వామిని మండల కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ పార్టీ శ్రేణులతో కలిసి దర్శించుకున్నారు. స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాణిక్ యాదవ్, రాజేష్, భీమ్‌రావ్ పాల్గొన్నారు.

భగవన్నామ స్మరణతోనే మోక్షం

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


ప్రత్యేక పూజలు చేసి దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

సదాశివపేట(సంగారెడ్డి): నిత్యం భగవన్నామ స్మరణతోనే మనశ్శాంతి లభిస్తుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని శంభులింగేశ్వర శివాలయంలో శివభక్తుడు ముద్దనాగు ఆధ్వర్యంలో శివ మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. మందిరంలో ముద్దనాగు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రభాకర్ శివాలయంలో పూజలు నిర్వహించి శంభులింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, శివస్వాములు, చింతాసాయినాథ్ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

సదాశివపేట(సంగారెడ్డి): మహాశివరాత్రిని పురస్కరించుకొని ఫసల్‌వాది గ్రామ పరిధిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఆధ్యాత్మిక ధార్మిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23న నిర్వ హించనున్న కోటి రుద్రాక్షలింగార్చనామ మహోత్స వ కరపత్రాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్ ఆవిష్కరించారు.

రోడ్డంతా గుంతలమయం


రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన మురికినీరు

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ పరిధిలోని మహీంద్రకాలనీ రోడ్డంతా గుంతలమయంగా మారింది. దీంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. సంగమిత్ర స్కూల్ రహదారి నుంచి కిలోమీటరు వరకు మహీంద్ర కాలనీ రోడ్డు పలు చోట్ల ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. మురికి కాల్వలు లేక మురుగునీరు రోడ్డుపై చేరి గుంతలు ఏర్పడుతున్నాయి. రోడ్డుపై మోకాలి లోతు మురికినీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వేరే గత్యంతరం లేక ప్రజలు మురికి నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇదే దారిలో వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. వారం రోజుల పాటు స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. స్వామి పల్లకీ సేవ, రథం ఊరేగింపు మురికి నీటి గుంట నుంచి తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే తాత్కాలికంగా గుంతలను పూడ్చి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంతో పూర్వ విద్యార్థులు

సదాశివపేట (సంగారెడ్డి): సదాశివపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1968–1969 పదవ తరగతి మొదటి బ్యాచ్ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 57 సంవత్సరాల తర్వాత కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం తమ జీవితాల్లో సాధించిన విజయాలను వేదికపై పంచుకుని సహపంక్తి భోజనాలు చేశారు. తెలంగాణ తొలి ఉద్యమంలో పోలీస్ తుటాలకు బలైన మిత్రులు భిమన్‌పల్లి శంకర్, కృష్ణ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సత్యనారాయణ, ప్రకాశం, కాశీనాథం, నర్సింలుగౌడ్, శేఖర్, కృష్ణ, ప్రతాప్, అజీజ్, చంద్రమౌళి పాల్గొన్నారు.

పురుషులకంటే మహిళలే అధికం

మండలంలో మొత్తం 34,424 ఓట్లు

మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు సంబంధించిన మొత్తం 34,424 ఓట్లు ఉన్నట్లు ఎంపీడీఓ హరినందన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురుషులు 17,007 మంది, మహిళలు 17,416 మంది ఉన్నట్లు తెలిపారు. మునిపల్లిలో ట్రాన్స్‌జెండర్ 1 ఓటు ఉందన్నారు. పురుషుల కంటే 409 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు.

రోడ్లు నిర్మించాలని రాస్తారోకో


రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

నారాయణఖేడ్: మండలంలోని అనంతసాగర్, సత్తెగామ, అంత్వార్, జూకల్, చందాపూర్ గ్రామాలకు రోడ్లు నిర్మించాలని బుధవారం ఖేడ్ జంట గ్రామం మంగల్‌పేట్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో తాను ఎమ్మెల్యేగా రోడ్ల నిర్మాణం కోసం జీఓలు తీసుకురాగా అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయని అన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే, ఎంపీ ఖేడ్‌కు చెందినవారే ఉన్నా పనులు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. రోడ్లు అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రోడ్డుపై బైటాయించి ధర్నా చేయడంతో పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. రాస్తారోకోలో మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పరమేష్, నాయకులు ముజమ్మిల్, నర్సింహులు, లక్ష్మణ్‌వు, వెంకటేశం, విఠల్, గోపాల్, మల్గొండ పాల్గొన్నారు.

రహదారికి తాత్కాలిక మరమ్మతులు


జహీరాబాద్-బీదర్ రహదారిపై చేట్టిన పనులు

జహీరాబాద్ టౌన్: ప్రమాదకరంగా తయారైన జహీరాబాద్-బీదర్ రహదారిని అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. జహీరాబాద్ నుంచి కర్నాటక రాష్ట్రంలోని బీదర్ వరకు సుమారు 30 కిలో మీటర్లు దూరంలో ఉన్న ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఆర్అండ్‌బీ పరిధిలోని రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించి ఫోర్‌లైన్‌గా మార్చేందుకు నేషనల్ హైవే అథారిటీకి బదలాయించారు. కొన్ని సంవత్సరాలు గడిచినా ఇంత వరకు రోడ్డు విస్తరణ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్నప్పుడు దెబ్బతిన్న రోడ్డుకు వెంటనే మరమ్మతులు జరిగేవి. నేషనల్ హైవే అథారిటీకి బదలాయించిన తరువాత అధికారులు రోడ్డు గురించి పట్టించుకోవడం లేదు. దీంతో అడుగడుగునా గుంతలు పడి అధ్వానంగా తయారై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు చనిపోగా పలువురికి గాయాలయ్యాయి. తరుచు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న అధికారులు పట్టించుకోవడం లేదని సాక్షి దినపత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు స్పందించిన అధికారులు నారింజ బ్రిడ్జికి ఇరువైపులా గుంతల పడిన రోడ్డును తవ్వి మరమ్మతులు చేస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులు కాకుండా ఫోర్‌లైన్ రహదారిగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు జీవన్ముక్త మహరాజ్ ఆరాధన

మునిపల్లి(అందోల్): అంతారం జీవన్ముక్త సంస్థానంలో గురువారం ఆరాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జీవన్ముక్త సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహరాజ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముందుగా పాండురంగ వితలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం జీవన్ముక్త మహరాజ్‌కు ప్రత్యేక పూజలు, ఆరాధన, పల్లకీసేవ, భజన కార్యక్రమం ఉంటుందన్నారు. ఆరాధన కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదం స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో మహారాష్ట్ర పూనకు చెందిన గాయత్రి ఉపాసకులు నందుకాక మహరాజ్, మల్లన్న పటేల్, విశ్వనాథం, నారాయణ, శంకరయ్యస్వామి, బీమయ్య, సంగమేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వీరభద్రుడి సన్నిధిలో చండీహోమం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ వీరన్నగూడెంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో బుధవారం చండీహోమం వైభవంగా నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకొని అర్చకుల వేదమంత్రాలతో ఆల యమాజీ చైర్మన్ భద్రప్ప ఉమారాణిలు దంపతు లు చండీహోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు, కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

◆ వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని చందాపూర్ శివారులోని సంగమేశ్వర ఆలయంలో వ్యాస పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను అశోక్ స్వామి, సంతోష్ స్వామి వేదపండితులచే సంప్రదాయబద్ధంగా వివిధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిపారు.

◆ 15 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ మహీంద్ర కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 15 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 15 నుంచి 20 వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. 15న అధ్యయనోత్సవాల విన్నపంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు చెప్పారు.

◆ వృక్షార్చన కరపత్రాల ఆవిష్కరణ

కంగ్టి(నారాయణఖేడ్): ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కోరారు. బుధవారం సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 17న మాజీ కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని నిర్వహించ తలపెట్టిన వృక్షార్చన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అభిమానులు పాల్గొని గ్రీన్ ఇండియాగా మార్చేందుకు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

◆ ఘనంగా తల్లిదండ్రుల పూజా దినోత్సవం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్లోక ఇంటర్నేషనల్ పాఠశాలలో సామూహిక తల్లిదండ్రుల పూజా దినోత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. వాలెంటైన్స్ డే వేడుకలను నిర్వహించవద్దని సూచిస్తూ ఆషారామ్ బాపు, యువ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక నాయకులు చంద్రారెడ్డి, మహేందర్ రెడ్డి ఆనంద్ కృష్ణారెడ్డిలు నిర్వాహకులతో కలిసి ఆషారాం బాపు చిత్రపటానికి మంగళహారతులు పట్టారు. వారు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ప్రతి ఏటా వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తూ జాగృతం చేస్తూ తల్లిదండ్రుల ప్రాముఖ్యతను తెలియజేయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలను పూజించి ఆశీర్వాదాలు పొందారు.

◆ ఘనంగా శివ మహాపడి పూజ

సంగారెడ్డి టౌన్: శివమహాపడి పూజను పట్టణంలోని గొల్లగూడెం శివాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శివనామస్మరణంతో ఆలయంలో భజనలు చేస్తూ పూజలు చేశారు. అనంతరం పడి వెలిగించారు. కార్యక్రమంలో శివస్వాములు, మహిళలు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.



◆ తెల్లాపూర్‌లో 17వార్డులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గతంలో మాదిరిగానే విలీన గ్రామాలతో కలిపి 17వార్డులను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విలీన గ్రామాలతో కలిపి మున్సిపల్ పరిధిలో 45వేల ఓట్లు ఉన్నాయన్నారు. ఒక్క వార్డుకు 2900 నుంచి 3వేల ఓట్ల చొప్పున ఓట్లును ఉన్నట్లు వివరించారు. ఈ విషయంపై త్వరలో ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తున్నట్లు వివరించారు.

◆ హిందువులు ఐక్యంతో ఉండాలి

జిన్నారం (పటాన్‌చెరు): హిందువులంతా ఐక్యంగా ముందుకు సాగాలని వక్త బ్రహ్మం గురూజీ అన్నారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హిందూ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సనాతన ధర్మమే దేశానికి శ్రీరామరక్ష అని పిలుపునిచ్చారు. వేదాలు ఉపనిషత్తులు నేటి ఆధునిక సైన్స్‌కి ఆధారమన్నారు. హిందువులను చైతన్య పరచడానికి హిందూ జాగరణ సమితి అనునిత్యం పనిచేస్తుందని వడ్ల ఆనంద్ చారి అన్నారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా నాయకులు రవికుమార్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, హిందూ బంధువులు పాల్గొన్నారు.

◆ నేడు అవగాహన కార్యక్రమం

కొండాపూర్(సంగారెడ్డి): మండల కేంద్రం కొండాపూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు అన్ని పార్టీల నాయకులతో సమావేశ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉ.11 గంటలకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్లు, అభ్యర్థనలపై అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు.

సంత్ రవిదాస్ గొప్ప సమతామూర్తి


శోభయాత్ర నిర్వహిస్తున్న మోచి సంగార్ నాయకులు

జహీరాబాద్ టౌన్: సమాజ శ్రేయస్సు కోసం పరితపించిన గొప్ప మేధావి సంత్ శిరోమణి గురు రవిదాస్ మహరాజ్‌ని పలువురు వక్తలు అన్నారు. సంత్ రవిదాస్ 648వ జయంతి ఉత్సవాలు మోచి సంగార్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధనసిరి పీఠాధిపతి వీరేశ్వర్ స్వామీజీ, బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్ మాట్లాడారు. చర్మకార కులంలో పుట్టిన వజ్రం సంత్ రావిదాస్‌ని అభివర్ణించారు. ప్రతి ఒక్కరు స్నేహభావంతో మెలగాలని, మనుషులంతా ఒక్కటేనన్న సమానత్వ సందేశాన్ని 14వ శతాబ్దంలో ఇచ్చిన గొప్ప సమతామూర్తిని కొనియాడారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జహీరాబాద్ మోచి సంగార్ సంఘం నాయకులు భారీ శోభయాత్ర నిర్వహించారు.